క్లుప్తంగా

సొంత ఖర్చుతో వాటర్‌ప్లాంట్



రఘునాథపల్లి : తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఇబ్రహీంపూర్‌లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు దాతలు ముందుకొచ్చారు. దివంగత మాజీ సర్పంచ్ లింగాల నర్సింహారెడ్డి–సుగుణాదేవి దంపతుల కుమారుడు సుభాష్‌చందర్‌రెడ్డి స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు సతీష్‌చందర్‌రెడ్డి, జగదీష్ చందర్‌రెడ్డి, మనోజ్ రెడ్డిలు సొంత నిధులతో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్లాంట్‌లో యంత్రాలను ఎంపీ కడియం కావ్య నిధులతో ఏర్పాటు చేయనున్నారు. ప్లాంట్ యంత్రాలు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వచ్చిన లింగాల కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన ఉప్పల మల్లన్న జాతర



దేవరుప్పుల : గ్రామ నామకరణానికి ప్రతీకగా ఏటా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని సాగే ఉప్పల మల్లన్న జాతర వసంతోత్సవంతో ఆదివారం ముగిసింది. ఉదయం ఊరు పుట్టుక స్థలమైన వాగులో శివపార్వతుల విగ్రహాలతో దోపోత్సవం నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో అగ్నిగుండాల కోసం ప్రత్యేక పూజల చేశారు. ఈ సందర్భంగా శివపార్వతుల శావతో భక్తులు అగ్నిగుండాలు దాటి తమ కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. అనంతరం పద్మశాలీలు శివపార్వతుల శావలతో ఎదురెదురుగా తిరుగుతూ రంగులు చల్లుకొని పరవశింపజేశారు.

ముగిసిన బొడ్రాయి వార్షికోత్సవం

దేవరుప్పుల మండల కేంద్రంలో నెలకొల్పిన బొడ్రాయి వార్షికోత్సవం సందర్భంగా శ్రీ కంఠ మహేశ్వర, ఈదమ్మ, పెద్దమ్మ గుడి, మైసమ్మ, గంగమ్మ తదితర గ్రామదేవతలు పండుగలతో ఆదివారం ముగిసింది.

ఇసుక లారీ బోల్తా



జనగామ రూరల్ : వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై జనగామ మండలం యశ్వంతపూర్ పరిధిలో ఆదివారం ఇసుక లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు ఏలాంటి గాయాలు కాలేదు. ఎస్సై చెన్నకేశవులు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

గాలి దుమారం.. ఆగమాగం



దేవరుప్పుల : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి గాలి దుమారంతో కూడిన అకాల వర్షం కురిసింది. వరి, మొక్కజొన్న పంటలు నేలరాలడంతోపాటు విద్యుత్ స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నీర్మాలలో ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది. సింగరాజుపల్లి నివాసిత ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు



జనగామ : జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జేరిపోతుల కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో తాళ్లపల్లి ఎల్లేష్, ఏ.దుర్గాప్రసాద్, రొండ్ల ఎల్లారెడ్డి, సౌమిత్రి శ్రీనివాస్, ఎస్.రంగన్న, టి.కొమురయ్య, పి.కుమార్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారంలో ఇటీవల మృతి చెందిన గూడెముల రమేష్, బత్తిని యశోద కుటుంబాలకు సిద్దేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ చల్ల సురేందర్‌రెడ్డి బియ్యాన్ని అందించారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యాన్ని అందించారు. రాములు, నర్సింహులు, బాలమల్లయ్య, హన్మంతు, ప్రభాకర్, యాదగిరి పలువురు పాల్గొన్నారు.

సమస్యల నిలయం.. గ్రంథాలయం

- సౌకర్యాలు లేక పాఠకుల ఇక్కట్లు
- శిథిలావస్థకు చేరుతున్న భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



శివునిపల్లిలోని శాఖ గ్రంథాలయం

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌కు జంట పట్టణంగా ఉన్న శివునిపల్లి గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. విజ్ఞాన నిలయంగా విరజిల్లాల్సిన స్థానిక గ్రంథాలయం సంబంధిత అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతోంది. ఎందరో పాఠకులకు విజ్ఞానాన్ని అందించిన గ్రంథాలయం ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యంతో కళ తప్పుతోంది. గ్రంథాలయంలో సరైన ఫర్నీచర్, మరుగు దొడ్లు, ఇతర సౌకర్యాలు లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్టేషఘన్‌పూర్ శాఖ గ్రంథాలయాన్ని మొదట 1990లో శివునిపల్లిలోని ఓ అద్దె భవనంలో నిర్వహించారు. అనంతరం 1998లో అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో శివునిపల్లిలో కొత్త భవనంలో ప్రారంభించారు. స్థానికుడైన ఆమంచ భిక్షపతి మొదటి లైబ్రేరియన్‌గా పనిచేసేవారు. స్థానికుడు కావడంతో దాతల సహకారంతో లైబ్రరీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశాడు. అనంతరం 2020 వరకు ఇన్‌చార్జ్‌లతో గ్రంథాలయాన్ని నడిపించారు. అయితే ఐదేళ్లుగా సంబంధిత అధికారులు గ్రంథాలయాన్ని పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.

అటెండరే పెద్దదిక్కు..

లైబ్రరీకి ఐదేళ్లుగా గ్రంథపాలకులు లేకపోవడంతో అటెండర్ (ఆఫీస్ సబార్డినేట్) పెద్ద దిక్కుగా మారాడు. లైబ్రరీకి స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ 30 మంది వరకు పాఠకులు వస్తుంటారు. గతంలో గ్రంథాలయానికి వివిధ దినపత్రికలతో పాటు పలు వార, మాస పత్రికలు, ఇంగ్లిష్ మ్యాగజైన్స్ వచ్చేవి. అదేవిధంగా వివిధ పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉండేవి. అయితే ప్రస్తుతం కొన్ని దినపత్రికలు మాత్రమే వస్తున్నాయి. దీంతో పాఠకుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రంథాలయం కళ తప్పుతోంది.

కనీస సౌకర్యాలు కరువు

గ్రంథాలయంలో సరిపడా ఫర్నీచర్ లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో భవనం పైకప్పు కురుస్తోంది. దీంతో లైబ్రరీలోని రాక్స్, పుస్తకాలు తడిసి పోతున్నాయి. కిటికీలకు తలుపులు లేకపోవడంతో పాటు భవనం పైకప్పు, గోడల పెచ్చులూడుతున్నాయి. టాయిలెట్ సౌకర్యం లేక గ్రంథాలయానికి వచ్చే పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని ప్రజలు, పాఠకులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



స్థానిక గ్రంథాలయం కొన్నేళ్లుగా పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతుంది. విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఎంతగానో ఉపయోగపడే లైబ్రరీని నిధుల లేమి సాకుతో పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా స్పందించి గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలి.

– మంగు జయప్రకాశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

సౌకర్యాలు కల్పించాలి



గ్రంథాలయంలో సరైన సౌకర్యాలు లేక పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా ఫర్నీచర్, తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యాలను కల్పించాలి. గతంలో ఒక వెలుగు వెలిగిన గ్రంథాలయాన్ని పట్టించుకోక పోవడం బాధాకరం. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– ఎస్.ఓంకార్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషితో పాటు పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తుండడంతో ఆయనకు అండగా నిలవాలనే సంకల్పంతోనే బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తరిగొప్పుల మండలం బొత్తలపర్రె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ముండావర్ తిరుపతి, రాజన్న, రాజేంద్రప్రసాద్, సంపత్, వెంకన్న, నవీన్, శ్రీకాంత్, విజయ్, రామన్న తదితరులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నుంచి చేరిన నాయకులు, కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజాసేవ నచ్చడంతోనే గులాబీ కండువా కప్పుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, నాయకులు గద్దల నర్సింగారావు, మసిఉర్ రెహాన్, బాల్దె సిద్ధిలింగం, ఉడు గుల కిష్టయ్య, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, మాజీ సర్పంచ్ కమల రవి నాయక్, గ్రామ ఉపాధ్యక్షులు రవి యాదవ్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి



బచ్చన్నపేట: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శేఖర్‌రెడ్డి

బచ్చన్నపేట : హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి వద్ద ఈ నెల 27వ తేదీన బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించనున్న రజతోత్సవ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలో బసిరెడ్డిపల్లి గ్రామంలో సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు రాగిపెల్లి బుచ్చయ్య, రాజు, జయపాల్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

జనసమీకరణలో ముందుండాలి

చిల్పూరు : ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జనసమీకరణలో మండల నాయకులు ముందంజలో ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పిలుపునిచ్చారు. శ్రీపతిపల్లిలో ఆదివారం నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ విజయవంతం కోసం మండలంలో ప్రజలను తరలించే విషయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు చేస్తున్న సమీకరణపై చర్చించారు. మండల ఇన్‌చార్జ్ మాలోత్ రమేశ్ నాయక్, నాయకులు జనగాం యాదగిరి, బత్తుల రాజన్‌బాబు, రజనీకుమార్, రంగు హరీష్, రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకుర్తి టౌన్ : జాతీయ అగ్నిమాపక భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో పాలకుర్తి అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ శ్రీరాములు ఆధ్వర్యాన మాక్‌డ్రిల్ ద్వారా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు తక్షణమే స్పందిస్తే ఆస్తి నష్టం తగ్గించవచ్చని అన్నారు. 101కి ఫోన్ చేసి అగ్ని ప్రమాదం సమాచారం తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది రామయ్య, నాగరాజు, అశోక్, ప్రశాంత్, ప్రదీప్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జనగామ రూరల్ : సమ్మేళనంలో పాల్గొన్న 2015-16 బ్యాచ్ విద్యార్థులు



పాలకుర్తి: 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని ధర్మకంచ జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2015–16 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా బాల్య జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను పూజించి ఘనంగా శాలువాలతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, మారుతి ప్రసాద్, బాలరాజు, రమేశ్, ఆంజనేయులు, సతీష్, నరేందర్, నాగరాజు, రాములు, నజీరుద్దిన్, అశోక్, పద్మజ, జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1990–91బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఓ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల్లో 8మంది మృతి చెందడం పట్ల వారి ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రైవేట్ వద్దు.. సర్కారుబడి ముద్దు



రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



బచ్చన్నపేట: ఎంఈఓకు టీవీ అందజేస్తున్న దాత

రఘునాథపల్లి : ప్రైవేట్ బడి వద్దు.. సర్కార్ బడి ముద్దు అని మండలంలోని ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం వినూత్న రీతిలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఆలేటి యాదవరెడ్డి ఆధ్వర్యంలో మన ఊరు–మన బడి–మనమే కాపాడుకుందాం.. సర్కార్ బడి పిల్లలు–సత్తా కలిగిన పిడుగులు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుక, రజిత, ఏపీసీ చైర్మన్లు ఎస్.స్వాతి, బి.లావణ్య, తల్లిదండ్రులు చంద్రమోహన్, సిద్దన్న, నర్సింగం, మహేష్, రాజమౌళి, నాగరాజు, రజిత, కోమల, హసీనా, అంగన్‌వాడీ టీచర్లు, రుషేంద్ర, రేణుక, అంజలి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అశ్వరావుపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

సులువుగా అర్థమయ్యేలా బోధించాలి

బచ్చన్నపేట : విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు పాఠాలను బోధించాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని ఆలింపూర్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పిల్లలకు డిజిటల్ క్లాసుల ద్వారా బోధన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలకు బీరెడ్డి కనకారెడ్డి స్మార్ట్ టీవీ, జొన్నల శ్రీనివాస్ రూ. 2 లక్షల విలువైన ఆట వస్తువులను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎండీ మసూద్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి



బండనాగారంలో మామిడి తోటను పరిశీలిస్తున్న ఏఓ రవికాంత్

బచ్చన్నపేట : మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలతో నష్టపోయిన పండ్ల తోటల రైతులు పరిహారం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవన శాఖ ఏఓ రవికాంత్ సూచించారు. ఆదివారం మండలంలోని చిన్నరామన్‌చర్ల, కొడవటూర్, బండనాగారం, లక్ష్మాపూర్, కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి పండ్ల తోటల నష్టాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం గాలిదుమారంతో పాటు అకాల వర్షానికి మామిడి కాయలు చాలా వరకు రాలిపోయాయన్నారు. పండ్ల తోటలు నష్టపోయిన రైతులు అదే తోట వద్ద ఫొటోలను దిగాలని అన్నారు. రైతు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లతో పాటు తోటల వద్ద దిగిన ఫొటోలతో ఆయా పరిధి ఫీల్డ్ ఆఫీసర్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు తోటల నష్ట పరిహారాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు కొప్పురపు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, కొల్ల నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇజ్జగిరి రాములు పలువురు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం


మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

పాలకుర్తి : మెగా జాబ్ మేళాను పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సోషల్ మీడియా కోఆర్డినేటర్లు గర్వందుల మల్లేష్, జోగు గోపిలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ త్వరలో ప్రారంభించబోయే ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులు 8978790201 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ గ్రామంలో ఎస్సీ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి కల్యాణ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. బైండ్ల పూజారి మనోహర్ ఆధ్వర్యంలో చేపట్టిన పూజల్లో జెడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ మారపాక రవి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కులపెద్దలు మారపాక కిషన్, మారపాక రాజయ్య, యాదయ్య, ఎల్లయ్య (వైఎస్), సోమయ్య, అనంతపురం యాదయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టగా అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మారపాక శ్రీనివాస్, వైస్‌చైర్మన్ రాములు, ప్రభాకర్, అనంతపురం బుచ్చయ్య, మహేందర్, ప్రభుదాస్, వసంత్, రాజ్ కుమార్, వెంకటస్వామి, జోజితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలకు నగదు జమ చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్ : మత్స్యకారుల అభివృద్ధికి ఉచిత చేప పిల్లలకు బదులు సొసైటీలకు నగదు జమచేయాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని మత్స్య సొసైటీ కార్యాలయంలో ఆదివారం మత్స్యకార్మిక సంఘం మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో చేపల మార్కెట్ నిర్మించి చేపలకు మద్దతు ధర ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చొప్పరి భిక్షపతి, నాయకులు గోనెల వెంకన్న, ఐలయ్య, రాములు, స్వరూప, శ్రీనివాస్, కవిత, కోమల, నరసమ్మ, చందు, కుమారస్వామి, బాలకృష్ణ, రాజయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పాలకుర్తి టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా అన్నారు. ఆదివారం పాలకుర్తిలో జిల్లా కార్యదర్శి సాంబరాజు సాంబయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు, నాయకులు హాజరయ్యారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



నర్మెట : అకాల వర్షాల వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు వెంట వెంటనే మిల్లులకు తరలించాలని తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజా చార్యులు సూచించారు. శనివారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని అధికారులతో కలసి ఆదివారం ఆయన పరిశీలించి మాటాడ్లారు. ఏఓ మనోహిత్ విక్రంరావు, ఆర్ఐ సిగసారపు సాయిబాబా, ఏఈఓ భూక్య అనిత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంపై మంగళవారం కేఎస్ఆర్ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు తెలిపారు.

నేడు పాలకుర్తిలో..

పాలకుర్తి : మండల రైతు వేదికలో నేడు (సోమవారం) భూభారతి చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ నాగేశ్వరాచారి, ఏఓ శరత్ చంద్ర తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై కృతజ్ఞతలు

దేవరుప్పుల : ఎస్సీ వర్గీకరణ సాధన ప్రక్రియకు అంకితభావంతో కాంగ్రెస్ ప్రభుత్వ కేబినెట్ మంత్రుల సంపూర్ణ సహకారాలకు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈరెంటి విజయ్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో చిన్నమడూరుకు చెందిన విజయ్ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మను కలిశారు.

దేవరుప్పుల: బాలయేసులో ఈస్టర్ డేలో ఫాదర్ జాన్



జనగామ రూరల్: ఉంద్రుపుర చర్చిలో ..



ఘన్‌పూర్: మాజీ ఎమ్మెల్యే రాజయ్య దంపతులు



యేసు పునరుత్థానంతోనే ప్రపంచ శాంతి

యేసు పునరుత్థానంతోనే ప్రపంచ శాంతి నెలకొందని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా చర్చిలో ఈస్టర్ డేను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేశారు.అలాగే దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్, కడవెండి చర్చిలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దంపతులు, క్రైస్తవ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్మెటలో ఈస్టర్ శాంతియాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు



చిల్పూరు: ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

నల్లబెల్లం, పటిక స్వాధీనం



దేవరుప్పుల : జనగామ– సూర్యాపేట రహదారి సింగరాజుపల్లి టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో నల్లబెల్లం, పటిక లభ్యం కాగా సీజ్ చేశామని ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున టోల్‌గేట్ వద్ద టాటా ఏస్ వాహనం అనుమానాస్పదంగా కనిపించగా దాన్ని ఆపే ప్రయత్నం చేశారు. డ్రైవర్ ముందుకెళ్లి ఆపి పారిపోయాడు. అందులో పరిశీలించగా గుడుంబా తయారు చేసేందుకు సుమారు 20 క్వింటాళ్ల నల్లబెల్లం, పటిక లభించింది. పారిపోయిన డ్రైవర్ తొర్రూరుకు చెందిన జాటోత్ నవీన్‌గా తెలిసిందని, బెల్లం, పటికతోఉన్న వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.